క్లుప్తంగా

రూ.300 కనీస వేతనం కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్

నారాయణవనం: గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు రోజుకు కనీసం రూ.300 గిట్టుబాటు అయ్యే విధంగా పని కల్పించాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ ఆదేశించారు. బుధవారం మండలంలోని బొప్పరాజుపాళ్యం పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను, రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీరు నిల్వ ఉండి, భూమిలో ఇంకే విధంగా చేపట్టే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. తప్పనిసరిగా కనీస వేతనంగా రూ.300 వచ్చే విధంగా కూలీలతో పనులు చేయించాలని, కూలీల సంఖ్యను పెంచాలని ఆయన సూచించారు. సౌకర్యాలను కల్పించకపోవడంపై క్షేత్రస్థాయి సిబ్బందిని ప్రశ్నించారు. విధిగా కూలీలకు ప్రథమ చికిత్స కిట్లను, తాగు నీరు, నీడ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయనతో పాటు మండల ఏపీఓ సుకణ్య, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల వివరాలు సమగ్రంగా ఉండాలి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ ప్రవీణ్

తవణంపల్లె: గుజ్జు ఫ్యాక్టరీలకు మామిడి కాయలు తోలిన రైతుల వివరాలను సమగ్రంగా ఆన్‌లైన్ చేసి నివేదిక పంపాలని వ్యవసాయాధికారి ప్రవీణ్ తెలిపారు. బుధవారం మండలంలోని పల్లెచెరువు, దిగువమాఘం రైతు సేవా కేంద్రాల్లో గుజ్జు ఫ్యాక్టరీలకు మామిడికాయలు తోలిన రైతుల జాబితా పరిశీలనకు గ్రామసభ నిర్వహించారు. మామిడికాయలు తోలిన వారి జాబితాను రైతులకు చదివి వినిపించారు. రైతుల వివరాల్లో ఏమైనా పొరబాట్లు ఉంటే సరిదిద్దు కోవాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల్లోని వివరాలను రైతులు పరిశీలించి సరిచూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పల్లెచెరువు సర్పంచ్ లావణ్య, దిగువమాఘం సర్పంచ్ గోపి, రైతు సేవా సిబ్బంది నవీన్, కుసుమ, రైతులు పాల్గొన్నారు.

ట్యాంకర్ ఢీకొని టెంపో వాహనం బోల్తా



టోల్‌ప్లాజా వద్ద ట్యాంకర్ ఢీకొనడంతో బోల్తా పడిన టెంపో

బంగారుపాళెం: మండలంలోని మహాసముద్రం టోల్ ప్లాజా వద్ద చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి టెంపోను ఓ ట్యాంకర్ వాహనం ఢీకొంది. కోలార్ నుంచి తిరుపతికి కూరగాయల లోడుతో వెళ్తున్న టెంపోను మహాసముద్రం టోల్‌ప్లాజా వద్ద పలమనేరు నుంచి చిత్తూరుకు వెళ్తున్న ట్యాంకర్ వెనుక నుంచి వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో టెంపో బోల్తాపడింది. డ్రైవర్లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. జాతీయ రహదారిపై టెంపో బోల్తా పడడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనదారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న హైవే మొబైల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని.. బోల్తా పడిన టెంపోను పక్కకు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తికి గాయాలు



ప్రభుత్వ ఆస్పత్రిలో క్షతగాత్రుడికి చికిత్స చేస్తున్న వైద్యులు

నాగలాపురం: మండలంలోని భారత్ గ్యాస్ సమీపంలో పుత్తూరు-చెన్నై హైవేపై బుధవారం రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైంది. వివరాలు.. పిచ్చాటూరు మండలం అప్పంబేడు గ్రామానికి చెందిన బాలమురుగన్ బైకుపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని గాయాలపాలయ్యాడు. వెంటనే స్థానికులు అతన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అయితే అతని తలకు బలమైన గాయం కావడంతో అక్కడి నుంచి వైద్యులు నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చిత్తూరు-తచ్చూరు రోడ్డు



దారి పొడవునా ప్రహరీ గోడ కట్టేస్తున్న దృశ్యం



మాకు దారెట్టా సామీ..!

చిత్తూరు- తచ్చూరు రోడ్డు నిర్మాణంతో దారి సమస్యలు పుట్టుకొస్తున్నాయి. నిర్మాణ పనులు పూర్తి కావస్తుండగా..దారి సమస్యలు ఏర్పడుతున్నాయి. రోడ్డు వెంబడి ప్రహరీ గోడ నిర్మాణంతో గ్రామాలు, వ్యవసాయ పొలాలకు దారులు మూసుకుపోతున్నాయి. వంకలు, కాలువలు కనుమరుగవుతున్నాయి. దీంతో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. గ్రామస్తులు, రైతులు అధికారుల వద్ద మొర పెట్టుకుంటున్నారు. అయినా పట్టించుకోకపోవడంతో వారు మండిపాటుకు గురవుతున్నారు.

- చిత్తూరు మీదుగా తచ్చూరు నేషనల్ హైవే నిర్మాణంతో ఇక్కట్లు
- పల్లెలకు, పొలాలకు మూసుకుపోయిన దారులు
- కాలువలు, వంకలకు బ్రేకులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామీణ జనం
- పట్టించుకోని అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జాతీయ రహదారి నిర్మాణంతో కొన్ని పల్లెలకు, ఆయా పల్లెలకు చెందిన వారి పొలాలకు దారి లేకుండా పోతోంది. దీంతో వారు తాము ఇళ్లకు.. పొలాలకు ఎలా వెళ్లాలని ప్రశ్నిస్తున్నారు. చిత్తూరు-తచ్చూరు నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా చిత్తూరు మండలం అనుపల్లి నుంచి ముత్తుకూరు వరకు నిర్మాణ పనులు సాగుతున్నాయి. 2018లో ప్రారంభమైన ఈ రోడ్డు నిర్మాణ పనులు 95 శాతం పూర్తయ్యాయి. సుమారు 615 మంది రైతుల నుంచి 90 ఎకరాల భూమి సేకరించారు. వీరికి పరిహారం కూడా చెల్లించారు. రోడ్డు నిర్మాణంలో కొన్ని భూతగాదాలు తలెత్తాయి. పరిహారం, దారి, ఇతరాత్ర సమస్యలకు సంబంధించినసమస్యలు నడుస్తున్నాయి.

హామీలు మరిచారు..

జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూసేకరణ కోసం రైతులతో అధికారులు చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో సమావేశం నిర్వహించారు. దారి సమస్య లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. భూసేకరణ పూర్తయింది. రోడ్డు నిర్మాణం కూడా 95 శాతం దాకా పూర్తి కావచ్చింది. ప్రస్తుతం జాతీయ రహదారి వైపు చూడకుండా రోడ్డుకు ఇరువైపులా ప్రహరీ గోడ కట్టేస్తున్నారు. నేషనల్ హైవే అధికారులు ఇచ్చిన చోట్ల మాత్రమే రోడ్డు పైకి వెళ్లేందుకు అనుమతులు ఉన్నాయి. ఇక గ్రామాలు, పంట పొలాలకు దారి ఇవ్వకుండా రైతులను, పలు గ్రామస్తులను ఇబ్బంది పెడుతున్నారు. సర్వీసు రోడ్డుకు ఎసరు పెట్టారు. తొలి నుంచి సర్వీసు రోడ్డు ఉంటుందని ఊహించిన ప్రజలకు ఇప్పుడు గట్టి షాక్ తగులుతోంది.

ఈ ప్రాంతాల్లో సమస్యలు..

చిత్తూరు మండలం మీదుగా వెళ్తున్న చిత్తూరు–తచ్చూరు జాతీయ రహదారి పొడవునా దారి సమస్యలు ఉన్నాయి. అనుపల్లి వద్ద పొలాలకు అసలు దారే లేదు. అలాగే బండపల్లి, గోపాలపురం, గొల్లపల్లి, ఎగువ మాసాపల్లి, దిగువమాసాపల్లి, ముత్తుకూరు, ఐనవేడు ప్రాంతాల్లో పొలాలకు దారి సమస్య ఏర్పడింది. దారి లేకపోవడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. పొలాలకు ఎలా వెళ్లాలని ప్రశ్నిస్తున్నారు. ఇక బండపల్లి బ్రిడ్జికి సమీపంలో ఏర్పడిన కొత్త కాలనీకి దారి లేదు. దీనిపై జిల్లా అధికారులు, నేషనల్ హైవే అధికారులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పొలాలకు, గ్రామాలకు దారి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే కాలువలు, వంకలు ఎక్కడికక్కడ మూసుకుపోయాయి. వీటి నుంచి వర్షపు నీరు సాగేందుకు దారి లేకుండా చేశారు. తద్వారా చెరువులకు నీరు సాగేందుకు దారులు లేకుండా పోయాయి.

మా ఇళ్లకు దారి ఇవ్వాలి..



మాది గువ్వకల్లు గ్రామం. గత ప్రభుత్వ హయాంలో నిరుపేదగా గుర్తించి 36 గొల్లపల్లి ప్రాంతంలో ఇళ్ల స్థలం కేటాయించారు. ఆ స్థలంలో అప్పో..సప్పో చేసి ఇళ్లు కట్టుకున్నాం. నేషనల్ హైవే వల్ల మా కాలనీకి దారి లేకుండా పోయింది. అధికారులకు ఫిర్యాదు చేశాం. అయినా ఇంతవరకు దారి సమస్యకు ఎవరు పరిష్కారం చూపడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించేలా చూడాలి.

\- సుబ్రమణ్యం, గువ్వకల్లు, చిత్తూరు మండలం

పొలానికి ఎలా వెళ్లాలి ?



రోడ్డు భూసేకరణ సమంలో రైతులు, భూయజమానులతో మీటింగ్ పెట్టిచ్చి పొలాలకు దారి సమస్య లేకుండా చూస్తామన్నారు. ఇప్పుడు రోడ్డు పనులు పూర్తయ్యాయి. దారిపొడవునా రహదారి కనిపించకుండా ప్రహరీ గోడ కట్టేస్తున్నారు. దారి చుట్టూ పక్కల మా పొలాలు ఉన్నాయి. అక్కడికి వెళ్లాలంటే దారి లేదు. అడిగితే సమాధానం ఇచ్చేవారు లేరు. ఇచ్చిన మాట ప్రకారం మాకు దారి ఇవ్వాలి. లేకుంటే రోడ్డెక్కుతాం.

\- గోపినాయుడు, ఎగువమాసాపల్లి, చిత్తూరు మండలం

యువత నైపుణ్యంపై దృష్టి సారించాలి

పూతలపట్టు(యాదమరి): ప్రస్తుత పోటీ ప్రపంచాన్ని ఎదుర్కోవాలంటే చదువు ఒక్కటే ప్రామాణికం కాదని అందుకు సరైన నైపుణ్యం కూడా తోడైతేనే రాణించగలమని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. బుధవారం ఆయన పూతలపట్టు మండలం పేటమిట్టలోని అమరరాజ ఫ్యాక్టరీలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సీడప్ వారి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన మెగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జీవితంలో తమకంటూ ఒక గుర్తింపు పొందాలంటే ఏదో ఒక రంగంలో ప్రావీణ్యం ఉండాలన్నారు. మన చేతిలో ఎన్ని డిగ్రీలున్నా సరైన నైపుణ్యం లేనిదే ఏ రంగంలోనూ రాణించలేమన్నారు. కాగా ఈ జాబ్ మేళాలో దాదాపు 25 ప్రముఖ సంస్థలు పాల్గొనగా వెయ్యి మందికి పైగా నిరుద్యోగులు హాజరయ్యారు.

మామిడి సబ్సిడీకి వివరాల సేకరణ



గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

యాదమరి: మండలంలోని మామిడి రైతులకు సబ్సిడీ మంజూరు చేయడానికి మండల రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు పలు గ్రామాల్లో రైతుల వివరాలు సేకరించారు. బుధవారం మండలంలోని 12 కమ్మపల్లి, మాదిరెడ్డిపల్లి, యాదమరి, కీనాటంపల్లి, సిద్ధారెడ్డిపల్లి, కాసిరాళ్ల, బోదగుట్టపల్లి, పత్రపల్లి, మాధవరం, 14కండ్రిగ ముస్లింవాడ రైతు సేవా కేంద్రాల్లో గ్రామసభలు నిర్వహించి మామిడి రైతుల వివరాల సేకరణ, లబ్ధిదారుల జాబితాను పరిశీలించారు. అలాగే ఇందుకు సంబంధించిన తుది జాబితాను ఈ నెల 23వ తేదీ లోపు జిల్లా ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పార్థసారథి, ఏఓ దీప, ఉద్యాన శాఖాధికారి లక్ష్మీప్రసూన పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలి



స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ హేమలత

తవణంపల్లె: విద్యార్థుల్లో పోటీతత్వం కలిగి ఉండాలని ఎంఈఓ హేమలత తెలిపారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీలో పొగాకు నియంత్రణ కోసం సంతకాలు అధికంగా సేకరించి ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ నెల ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు 7, 8, 9 తరగతుల విద్యార్థులచే పొగాకు నియంత్రణపై సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. పొగాకు వ్యతిరేక సంతకాల సేకరణ, పొగాకు నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై ప్రతిజ్ఞ గురించి ప్రజలకు తెలియజేసి సంతకాలు సేకరించామన్నారు. అధికంగా సంతకాలు సేకరించిన తొడతర హైస్కూల్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో కె.మోనిత్‌ఆచారి, టి.మహీధర్ నిలిచారు. తృతీయ స్థానంలో తవణంపల్లె హైస్కూల్ విద్యార్థి సకేత్‌కుమార్ రెడ్డి నిలిచారు. వీరికి ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సమకూర్చిన స్కూల్ బ్యాగులను అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీ గోపి, ఆరోగ్యశాఖ పొగాకు నియంత్రణ సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

గోకులం షెడ్లతో పాడికి ప్రోత్సాహం



మాట్లాడుతున్న అధికారులు

యాదమరి: యాదమరి మండలానికి కొత్తగా 190 మినీ గోకులంషెడ్లు మంజూరైనట్లు ఏపీడీ సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సంబంధిత శాఖాధికారులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల సౌలభ్యం కోసం ప్రభుత్వం గోకులం షెడ్లను నిర్మిస్తోందని చెప్పారు. పాడి రైతులకు ఇవి ఉపయోగపడతాయన్నారు. గ్రామాల్లో పాడిపరిశ్రమను ప్రోత్సహించడానికే గోకులం షెడ్లను నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ వేణు అన్నారు. అనంతరం ఏపీఓ సంధ్యారాణి మాట్లాడుతూ పల్లెల్లో మినీ గోకులం షెడ్ల నిర్మాణాలపై రైతులు ఆసక్తి చూపించడం సంతోషదాయకమన్నారు. దీంతో పశుపోషణ, గొర్రెలు, మేకల పెంపకానికి, పాడి పరిశ్రమకు ఉపయోగపడేలా షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతామని చెప్పారు. గతంలో నిర్మించిన గోకులం షెడ్లకు కొన్ని సాంకేతిక సమస్యల వల్ల పెండింగ్‌లో ఉన్న బిల్లులు సైతం అతి త్వరలోనే లబ్ధిదారుల ఖాతాలలో జమ అవుతుందన్నారు. ఆసక్తి కలిగిన ప్రతి రైతూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యులు డా.మునిచంద్ర కోరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షురాలు చిత్రానాయుడు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధిహామీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పేదల చెంతకు చేరని సూపర్‌సిక్స్

\- బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీలో వైఎస్సార్‌సీపీ నాయకులు



క్యూఆర్ కోడ్‌ను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుడిపాల: కూటమి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మోసాలను ఇంటింటికీ వివరించాలని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బుధవారం కట్టకిందపల్లె, 189 కొత్తపల్లె, పేయనపల్లెలో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలప్పుడు ప్రజలకు లేనిపోని హామీలిచ్చి ఊదరగొట్టారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చి 14 నెలలు దాటినా ఇంతవరకు ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు చేయలేక చతికిల పడుతున్నారని ఆరోపించారు. ప్రతి పథకాన్ని అరకొరగా అమలు చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. చాలా మంది అర్హులకు పథకాలు అందకుండా పోతున్నాయన్నారు. నిరుద్యోగ భృతి, మహిళలకు ఆడబిడ్డ నిధి, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ వంటి హామీలను ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే చంద్రబాబు మోసపూరిత మాటలు నమ్మి మోసపోయామని ప్రజలు గోల పెడుతున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని లేకుంటే ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. గతంలోని వైఎస్సార్‌సీపీ హయాంలో అధికారంలోకి వచ్చిన ఏడాదికే పథకాలన్నీ అమలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఎన్నికలప్పుడు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని అప్పటివరకు ప్రజల తరఫున వైఎస్సార్‌సీపీ నిలుస్తూనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ప్రకాష్, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, సర్పంచులు రజినీకాంత్, సునీలా, పెరిల్లా, నాయకులు డానియల్, రెడ్డెప్ప, దీన, లడ్డురెడ్డి, సంపత్, కారిమేగన్, చిట్టిబాబు, రమేష్, రాజేష్, కిరణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనిల్

యాదమరి: ప్రస్తుత వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని..ఇప్పుడు అప్రమత్తత అవసరమని మండల వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్‌నాయక్ అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని వరదరాజులపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 104 వైద్యసంచార వాహనం ద్వారా వైద్య సిబ్బంది ప్రతీ గ్రామానికి వస్తారని చెప్పారు. గ్రామంలోనే వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి అందుకు అవసరమైన మందులు అందజేస్తారని చెప్పారు. వైద్య చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే అవసరం లేదన్నారు. జలుబు, జ్వరం, తలనొప్పి, కీళ్లనొప్పులపై జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

దోమకాటుతో ప్రాణాంతక జ్వరాలు



ప్రతిజ్ఞ చేస్తున్న యాదమరి పీహెచ్‌సీ వైద్యసిబ్బంది



టి.పుత్తూరు రోడ్డు కూడలిలో మానవహారం ఏర్పాటు చేస్తున్న వైద్యసిబ్బంది

యాదమరి: దోమలను సమూలంగా నిర్మూలించి వాటి బారి నుంచి ప్రజలను సురక్షితంగా కాపాడుకుందామని మండల వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్ పిలుపునిచ్చారు. ప్రపంచ దోమల నిర్మూలన దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సీహెచ్ఓ శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమకాటు వల్ల ప్రాణాంతకమైన జ్వరాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, మెదడువాపు వంటి జ్వరాలు ప్రబలి ప్రజల ఆరోగ్యాన్ని క్షీణించేలా చేస్తుందని చెప్పారు. వాటి నిర్మూలనకు ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. అందువల్లే ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని తద్వారా దోమలను అరికట్టవచ్చన్నారు. అనంతరం సిబ్బందిచే మానవహారం నిర్వహించి దోమలు నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేసి ప్రజల్లో అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు లక్ష్మీపతి, సెల్వరాణి, హెల్త్ అసిస్టెంట్ సురేంద్రనాథ్‌రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు, మహిళా ఆరోగ్యకార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పూతలపట్టులో..

పూతలపట్టు(యాదమరి): పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ వినయ్, సీహెచ్ఓ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ దోమల నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ దోమ పుట్టకుండా-కుట్టకుండా చూసుకుంటే, జబ్బుల నుంచి ప్రజలను కాపాడుకోవచ్చన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకున్నప్పుడే దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ నరసింహప్రసాద్, హెచ్ఎస్ ధర్మేంద్ర, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తవణంపల్లె: దోమ చిన్నదైనా ప్రమాదం పెద్దదని వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. ఆరోగ్య వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ సౌజన్యంతో ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రమైన తవణంపల్లెలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం టి.పుత్తూరు రోడ్డు కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు దరఖాస్తుల వెల్లువ



దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చిన రైతులు

గుడిపాల: అన్నదాత సుఖీభవకు దరఖాస్తులు వెల్లువగా వచ్చాయి. సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తారని అధికారులు తెలియజేసినా అక్కడ ఎవరూ అందుబాటులో లేకపోవడంతో వ్యవసాయశాఖ కార్యాలయానికి రైతులు తరలివచ్చారు. దీంతో వ్యవసాయ కార్యాలయంలో రైతుల వద్ద నుంచి దరఖాస్తులను తీసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. చాలామంది రైతులకు వెబ్‌ల్యాండ్‌లో ఆధార్‌లింక్ కాకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇందుకు రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యమే కారణమనే భావనకు రైతులు వచ్చారు.

శ్రీకృష్ణ భగవానుడి గ్రామోత్సవం



బంగారుపాళెంలో శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగిస్తున్న భక్తులు

బంగారుపాళెం: గీతా సారాంశమే మానవాళికి ముక్తి మార్గమని ప్రబోధానంద భక్తులు తెలిపారు. మండలకేంద్రం బంగారుపాళెంలో బుధవారం సాయంత్రం శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమను ఘనంగా ఊరేగించారు. శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని ఇందూ జ్ఞానవేదిక, ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ నుంచి 20 వరకు ప్రత్యేక పూజలు, గీతా పారాయణం కార్యక్రమాలు చేపట్టారు. బుధవారం సాయంత్రం శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమను విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిపై కొలువుదీర్చి బంగారుపాళెం, తగ్గువారిపల్లె పురవీధుల్లో మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, కోలాట ప్రదర్శన నడుమ ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు కర్పూర హారతులు సమర్పించి, కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవాసమితి నిర్వాహకులు మాట్లాడుతూ శ్రీకృష్ణాష్టమిని ఏటా ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.